క్లుప్తంగా

'మధ్యాహ్న' కార్మికుల వేతనాలు పెంచాలి



మధ్యాహ్న భోజన తయారీ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న బుచ్చిబాబు

గోపాలపురం: పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజనం తయారీ కార్మికుల వేతనాలు పెంచాలని, కొన్ని పాఠశాలల్లో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.బుచ్చిబాబు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని మధ్యాహ్న భోజన తయారీ కార్మికులతో మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు. బుచ్చిబాబు మాట్లాడుతూ కార్మికులకు గౌరవ వేతనంగా రూ.10 వేలు చెల్లించాలని, విద్యార్థుల మెనూ మార్చాలని, వారి రోజువారీ మెస్ చార్జీలు రూ.10 నుంచి రూ.15కు పెంచాలని, ఉచితంగా వంట గ్యాస్ పంపిణీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దాకే లక్ష్మీకాంతం, ముప్పడి మంగ, లింగంకుంటి బేబీ, వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజనం తయారీ కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలు ఇద్దరినీ అరెస్టు చేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాల సంఘాల జేఏసీ నాయకులు

కొవ్వూరు: ఉండి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యేలు రఘురామకృష్ణంరాజు, పంతం నానాజీలను తక్షణం అరెస్ట్ చేయాలని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని క్రిస్టియన్‌పేట అంబేడ్కర్ విగ్రహం వద్ద సంఘ నాయకులతో కలసి మంగళవారం ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఏలూరుపాడులో అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపి అవమానించిన రఘురామకృష్ణంరాజు, దళిత డాక్టర్‌పై దౌర్జన్యం చేసి అసభ్యకర పదజాలంతో దూషించిన నానాజీలను పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. గృహ నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు. ఇద్దరు ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా త్వరలోనే కార్యాచరణ ప్రకటించి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. తరిపే బంగారయ్య, బొంతా లక్ష్మణ్, బొమ్మత్తుల భాస్కర్, పాతాళ రవి, దర్శి చెన్నయ్య, బి.వెంకట్రావు పాల్గొన్నారు.

కుండపోత వర్షానికి జలమయం



కాకరపర్రులో నీట మునిగిన అరటి తోట

పెరవలి: మండలంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి పల్లపు చేలు నీట మునిగాయి. మెట్ట చేలకు నీటి ఎద్దడి తొలగింది. దాదాపు రెండు గంటల పాటు కురిసిన వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. ప్రజలు ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. ఖండవల్లి, అన్నవరప్పాడు, ముక్కామల, కానూరు, కాపవరం, కాకరపర్రు గ్రామాల ఎస్సీ, బీసీ కాలనీల్లోని నీరు చేరింది. అరటి చేలు, దొండ, బీర, పొట్ల, ఆనబ పందిర్లు నీట మునిగాయి. పల్లపు చేలో నీరు లాగాలంటే రెండు రోజుల సమయం పడుతుందని రైతులు చెబుచున్నారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు, అధిక ఎండల వలన పంటలు తెగుళ్ల బారిన పడ్డాయి. ఇప్పటికే వర్షాల వలన పందిరి కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి.

పాలస్తీనా మృతులకు సంతాపం

నిడదవోలు: పాలస్తీనా మృతులకు సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పిలుపు మేరకు స్థానిక ఐఎఫ్టీయూ స్థూపం వద్ద మంగళవారం కొవ్వొత్తులు వెలిగించి సంతాపం వ్యక్తం చేశారు. ప్రపంచంలో మూడో శక్తిగా ఎదుగుతున్న భారత్ కల్పించుకుని పాలస్తీనా-ఇజ్రాయెలు యుద్ధాన్ని విరమింపజేయాలని కోరారు. ఇందుకు ప్రధాని మోడీ చొరవ తీసుకోవాలని నాయకులు ఈమని గ్రీష్మకుమార్, లంకాడ గణపతి, పిచ్చా సూర్యకిరణ్, మల్లిడి వెంకటరామిరెడ్డి, సత్యనారాయణ, బాపినీడు, సిరిల్ తదితరులు కోరారు.

నూరు శాతం ఈ-క్రాప్ నమోదు



గోపాలపురం మండలంలో ఈ- పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, సిబ్బంది



గోపాలపురం రైతు సేవా కేంద్రంలో రైతులకు ఈ-కేవైసీ చేస్తున్న వ్యవసాయాధికారి రాజారావు

- 88,982 ఎకరాల్లో ఈ పంట నమోదు
- 38,238 మంది రైతుల ఈకేవైసీ పూర్తి
- రైతు సేవా కేంద్రాల వద్ద జాబితాల ప్రదర్శన

దేవరపల్లి: ఈ పంట నమోదు పూర్తయ్యింది. కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా నూరు శాతం పంట నమోదు జరిగింది.ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయాధికారి ఎం.మాధవరావు పర్యవేక్షించారు. ఈ క్రాప్ నమోదును ప్రభుత్వం తప్పనిసరి చేయడంతో వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో రైతు సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు. వ్యవసాయ పంటలతో పాటు ఉద్యాన పంటలకు కూడా ఈ పంట నమోదు చేస్తున్నారు. ఈ పంట నమోదు చేయించుకున్న రైతులకు ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రభుత్వం నష్ట పరిహారం మంజూరు చేస్తుంది. పంటను మార్కెట్లో గిట్టుబాటు ధరకు అమ్ముకొనే సదుపాయం పొందవచ్చు. ప్రభుత్వం అందిస్తున్న ఇన్‌పుట్ సబ్సిడీ వంటి సదుపాయాలు కూడా పొందవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు వివరిస్తున్నారు. రైతులు కూడా సహకరించడంతో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో ఈ పంట నమోదును దాదాపు పూర్తిచేశారు. ఈ పంట నమోదు, రైతుల ఈకేవైసీ పూర్తి కావస్తుండడంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు చేస్తోంది. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

డివిజన్‌లో 88,982 ఎకరాల్లో వరి సాగు

కొవ్వూరు డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లో 38,228 మంది రైతులు 88,982 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. రైతుల వేలిముద్రలతో వీఏఏ, వీఆర్వోల ఈకేవైసీ పూర్తి చేశారు.

ఈ పంట నమోదు వల్ల ఉపయోగాలు

ఈ పంట నమోదు వల్ల కలిగే ఉపయోగాలు ఈ విధంగా ఉన్నాయి. బ్యాంకు రుణాలు పొందవచ్చు. ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వర్తిస్తుంది. ప్రభుత్వ పథకాలను పొందవచ్చు. పండించిన పంటను గిట్టుబాటు ధరకు అమ్ముకోవచ్చు.

మండలాల వారీగా జరిగిన ఈ పంట నమోదు వివరాలు

మండలం	రైతులు	ఈ పంట నమోదు (ఎకరాల్లో)
చాగల్లు	3968	7714
కొవ్వూరు	4157	10568
పెరవలి	4712	7692
నిడదవోలు	8771	16503
నల్లజర్ల	3220	8252
దేవరపల్లి	2551	8078
తాళ్లపూడి	2914	8994
ఉండ్రాజవరం	4607	11429
గోపాలపురం	3338	9752
	38238	88982

రైతుల జాబితాల ప్రదర్శన



ఈ కేవైసీ, ఈ పంట నమోదు చేయించుకున్న రైతుల జాబితాలను రైతు సేవా కేంద్రాల వద్ద ప్రదర్శించాం. వాటిలో ఒకవేళ చేర్పులు, మార్పులు ఉంటే రైతులు అభ్యంతరాలను స్వీకరించి సోషల్ ఆడిట్ చేస్తున్నాం. డివిజన్ వ్యాప్తంగా 88,982 ఎకరాల్లో పంట నమోదు జరిగింది. రైతుల నుంచి ఈ కేవైసీ తీసుకుని జాబితాలను సిద్ధం చేశాం. ఈ పంట నమోదు వల్ల రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయి.

– చంద్రశేఖర్, ఏడీఏ, కొవ్వూరు

రైతుల ఇష్ట ప్రకారం ధాన్యం అమ్ముకోవచ్చు

- దేవరపల్లి తహసీల్దార్ రాజ్యలక్ష్మి
- వ్యవసాయ, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ శాఖల అధికారులు, రైస్ మిల్లర్లతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మి

దేవరపల్లి: పండించిన ధాన్యాన్ని రైతులు తమ ఇష్ట ప్రకారం మిల్లుకు రవాణా చేసుకుని అమ్ముకోవచ్చని తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై బుధవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయం, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. ఎప్పటి ధాన్యం అప్పుడు కళ్లాల్లోనే కొనుగోలు చేస్తారన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు కళ్లాల వద్దకు వచ్చి ధాన్యంలో తేమ శాతాన్ని చూస్తారని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం, రైతు సేవా కేంద్రాల వద్ద తేమశాతం తెలిపే యంత్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రైతులకు ఎక్కడ గిట్టుబాటు ధర లభిస్తే అక్కడ పంటను అమ్ముకోవచ్చన్నారు. రైతు సిర్రా వెంకట్రావు మాట్లాడుతూ రెండేళ్లుగా పండించిన ధాన్యం అమ్ముకోవడానికి అనేక ఇబ్బందులు పడినట్టు తెలిపారు. రైతు సేవా కేంద్రం వద్ద 17 శాతం తేమ ఉండగా, మిల్లు వద్ద 20 శాతం వచ్చేదని తెలిపారు. కిలో మీటరు దూరంలోని మిల్లుకు ధాన్యం రవాణా చేస్తే తేమ శాతం ఎందుకు పెరుగుతుందని ప్రశ్నించారు. మిల్లుల వద్ద ఏసీ గదుల్లో తేమ శాతం యంత్రాలను ఉంచి తేమశాతం చేసేవారని తెలిపారు. తేమ శాతం ఎక్కువ ఉందని, లారీకి రూ.20 వేలు ఇవ్వాలని మిల్లర్లు డిమాండ్ చేసి వసూలు చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు కొన్ని నిబంధనలను ప్రభుత్వం సడలించిందన్నారు.ధాన్యం సేకరణలో ఇక నుంచి రైతులకు సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సివిల్ సప్లయిస్ డీటీ సత్యనారాయణ మాట్లాడుతూ పండగ వాతావరణంలో ధాన్యం అమ్మకాలు జరగాలన్నారు. మండల వ్యవసాయాధికారి కె.విజయ్ మాట్లాడుతూ మండలంలో 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఖరీఫ్‌లో 23 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. ఏటా 13 వేల మెట్రిక్ టన్నులు రైతు సేవా కేంద్రాల ద్వారా, 10 వేల మెట్రిక్ టన్నులు రైస్ మిల్లర్లు కొనుగోలు చేస్తున్నట్టు వివరించారు. దేవరపల్లి మండలంలో మూడు, చాగల్లు మండలంలో 27 మిల్లులను మండలానికి కేటాయించినట్టు తెలిపారు. సమావేశంలో రైస్ మిల్లర్లు చలంచర్ల హరిబాబు, చలచర్ల అప్పారావు, టెక్నికల్ అసిస్టెంట్లు, రైతులు, పాల్గొన్నారు.

రాజధాని పునర్నిర్మాణానికి విరాళం

కొవ్వూరు: రాజధాని అమరావతి పునర్నిర్మాణానికి స్థానిక ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు కలసి రూ.3,12,716 లు విరాళంగా సేకరించినట్టు ప్రిన్సిపాల్ ఎస్వీ సుబ్బారావు తెలిపారు. ఈ మొత్తాన్ని డీడీ రూపంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు అమరావతిలో మంగళవారం అందజేసినట్టు సుబ్బారావు చెప్పారు.

రూ.25 లక్షలతో దుర్గమ్మకు అలంకరణ



పెరవలి మండలం ముక్కామలలో రూ.25 లక్షలతో మహాలక్ష్మి అమ్మవారికి అలంకరణ



తాళ్లపూడిలో రూ.10 లక్షలతో కనకదుర్గమ్మ వారికి అలంకారం

పెరవలి: ముక్కామల వేంద్రవారి వీధిలోని దుర్గమ్మ ఆలయం వద్ద మండపంలో అమ్మవారిని మహాలక్ష్మి అవతారంలో అలంకరించారు. రూ.25 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఇక్కడ 25 ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహించడంతో పాటు రూ.25 లక్షలతో అలంకరించామని ఉత్సవ కమిటీ తెలిపారు. ఖండవల్లిలో తెల్లవారుజామున 4 గంటల నుంచి కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక కుంకమ పూజలు చేశారు. కానూరులో కొండాలమ్మ, కనకదుర్గమ్మ, కాకరపర్రు దుర్గమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాళ్లపూడిలో రూ.10 లక్షలతో..

తాళ్లపూడి: స్థానిక నవదుర్గా శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ వారిని మంగళవారం రూ.10 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో ధనలక్ష్మీదేవిగా అలంకరించారు.అర్చకులు శివప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, సహస్రనామార్చన, లలితాపారాయణ, పల్లకీ సేవ, హారతి నిర్వహించారు.

బాణసంచా తయారీ కేంద్రాల్లో తనిఖీలు



పసలపూడిలో బాణసంచా తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసాద్

ఉండ్రాజవరం: బాణసంచా తయారీదారుల వద్ద ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే బాణసంచా నిల్వలు ఉండాలని తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ సూచించారు. మండలంలోని పసలపూడి, సూర్యారావుపాలెం, తాడిపర్రు గ్రామాల్లోని బాణసంచా తయారీ కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. తయారీదారులు నిబంధనల మేరకే బాణసంచా తయారు చేస్తున్నారని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బాల కార్మికుల చేత బాణసంచా తయారు చేయించవద్దన్నారు. కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలన్నారు. తయారీదారులు పాటించాల్సిన పలు నిబంధనలను వివరించారు.

98 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స



పశు వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు తదితరులు

చాగల్లు: వ్యవసాయం, పశుపోషణ అనే రెండింటికీ రైతులు సమ ప్రాధాన్యం ఇచ్చి ఆర్థికంగా బలపడాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక ప్రభుత్వ పశు వైద్యశాల వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన పశువుల గర్భకోశ వ్యాధుల ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ శిబిరంలో 98 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు. 221 పశువులకు బాహ్య పరాన్నజీవుల నిర్మూలన మందు వేశారు. 182 మంది రైతులకు ఖనిజ లవణ మిశ్రమం పంపిణీ చేశారు. అలాగే 82 పశువులకు నట్టల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు వేశారు. 38 పశువులకు చూళి పరీక్షలు చేశారు. జిల్లాపశుసంవర్ధక అధికారి టి.శ్రీనివాసరావు, ఉప సంచాలకులు ఎస్.సత్యనారాయణ, జేసురత్నం, ఆర్.వెంకటేశ్వరరావు, ఎ.వెంకటరెడ్డి పర్యవేక్షణలో పశు వైద్య సహాయకులు పశువులకు సేవలందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుపై దృష్టి పెట్టండి

గోపాలపురం: ఉద్యాన పంటల సాగుపై రైతులు మొగ్గు చూపాలని ఉద్యాన వనశాఖాధికారి కె.రమేష్ సూచించారు. మామిడి, జీడిమామిడి, ఇతర ఉద్యాన పంటల సాగుపై మండలంలోని నంది గూడెం గ్రామంలో రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా మామిడి, జీడిమామిడి, పామాయిల్, కొబ్బరి, అంతర్ పంటలుగా కోకో, వక్క పంటల సాగుచేసే వారికి రాయితీ కల్పిస్తున్నట్టు తెలిపారు. నీటిని ఆదా చేయడం కోసం సూక్ష్మ సేద్యం ద్వారా ఐదెకరాల లోపు భూమి కలిగిన రైతులకు 90 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.రాజారావు, సర్పంచ్ ఇళ్ల శ్రీరామమూర్తి, మడిచర్ల ప్రసాద్, ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ సన్నిధిలో 329 మంది కుంకుమ పూజలు



నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ వారి దర్శనానికి ఆరో రోజైన మంగళవారం భక్తులు పోటెత్తారు.అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి 329 మంది దంపతులు సహస్ర నామ కుంకుమ పూజలతో పాటు చండీ పారాయణం, హోమాలు నిర్వహించారు.అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.2,00,723 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాశ్ చెప్పారు. అలాగే మండలంలోని కంసాలిపాలెం శ్రీదేవి పాటెమ్మ వారు, గోపవరం గుబ్బల మంగమ్మ, సమిశ్రగూడెంలోని పుంతలో మునసలమ్మ ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. డి.ముప్పవరంలో కొండాలమ్మ, లోహియానగర్‌లో కనకదుర్గమ్మ వార్లను అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

చోరీకి గురైన మోటార్ బైక్ స్వాధీనం

తాళ్లపూడి: చోరీకి గురైన బైక్‌ను పోలీసులు రికవరీచేశారు. వివరాలిలా ఉన్నాయి. కడియం మండలం పొట్టిలంకకు చెందిన కొత్తపల్లి నారాయణ బైక్ గత నెల 5న తాళ్లపూడి బస్టాండ్ సెంటర్లోని ఒక హోటల్ ముందు చోరీకి గురైంది. మంగళవారం తాళ్లపూడిలో ఎస్సై రామకృష్ణ తన సిబ్బందితో కలసి వాహనాలు తనిఖీ చేపట్టారు. అదే సమయంలో పెనకనమెట్టకు చెందిన ఆనందెల్లి వీర్రాజు అనే వ్యక్తి అదే మోటార్ బైక్ వేసుకు వస్తూ పోలీసులకు చిక్కాడు. అతడిని అదుపులోకి తీసుకుని బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు.

సౌభాగ్య దుర్గాంబికకు జలాభిషేకం



దేవరపల్లిలో గోదావరి జలాలతో కలశ ప్రదర్శన చేస్తున్న మహిళలు



చాగల్లులో అమ్మవారిని దర్శించుకుంటున్న కార్మిక మంత్రి సుభాష్ తదితరులు

దేవరపల్లి: దసరా ఉత్సవాల్లో భాగంగా మహాలక్ష్మీదేవిగా మంగళవారం దుర్గాదేవిని అలంకరించి, భక్తులు కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. స్థానిక వాటర్ ట్యాంక్ రామకృష్ణ వీధిలోని దుర్గాదేవిని మహాలక్ష్మీ అవతారంలో రూ.1.10 లక్షలు, బాలదుర్గమ్మ వారిని రూ.1.55 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. మూడు రోడ్ల కూడలిలోని సౌభాగ్య దుర్గాంబిక దేవికి గోదావరి జలాలతో మహాభిషేకం చేశారు. వందలాది భక్తులు అయ్యప్పస్వామి ఆలయం వద్ద గల తాడిపూడి కుడి ప్రధాన కాలువకు వెళ్లి కలశాల్లో గోదావరి జలాలను నింపుకుని సుమారు ఐదు కిలోమీటర్లు కలశ ప్రదర్శన అనంతరం సౌభాగ్య దుర్గాంబికా దేవికి మహా జలాభిషేకం చేశారు.

చాగల్లు: మండలంలోని ఊనగట్ల గ్రామంలోని, చాగల్లు పిడింగొయ్య వద్ద గల బాల కనకదుర్గమ్మ వారిని, వల్లుగుంట శ్రీకనకదుర్గమ్మవారిని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భవానీమాలలో ఉన్న మంత్రి భక్తులతో కలసి పూజల్లో పాల్గొన్నారు. ఆయా ఉత్సవ కమిటీల సభ్యులు మంత్రిని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఉత్సవ కమిటీల సభ్యులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఎస్ఎఫ్ఏ సభ్యులు, మంత్రి అభిమానులు పాల్గొన్నారు.